## రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**జమ్మికుంట నవంబర్ 08 (ప్రజామంటలు):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎనుముల రేవంత్ రెడ్డి గారి 54వ జన్మదిన వేడుకలు ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో ఘనంగా కేక్ కట్ చేసి స్వీట్ పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇంగి లే రామారావు మాట్లాడుతూ.... రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలో మరియు ఒడితెల ప్రణవ్ అన్న నాయకత్వంలో హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేష్, సంపత్, రామకృష్ణ, పరమేశ్, శ్రీనివాస్, రమేష్, రాజయ్య, కిరణ్, సాయి, మహేష్, ఎల్లయ్య, దిలీపు, యూత్ కాంగ్రెస్ నాయకులు మహేష్, రవి, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా చిదురాల సురేష్



**భీమదేవరపల్లి నవంబర్ 08 (ప్రజామంటలు):** యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా భీమదేవరపల్లి మండలం ముల్క నూరుకు చెందిన చిదురాల సురేష్ ఎంపికైనట్లు యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శులు తెలంగాణ ఇన్చార్జిలు సురభి ద్వివేది, ఖలీద్, రమేష్ బాబు, మొహమ్మద్ ఇల్తాజ్ ఉత్తర్వులను జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజిద్ ఖాన్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రేపల్లె రంగనాథ్, సిద్దిపేట్ జిల్లా అధ్యక్షురాలు తుముకుంట అంక్షరెడ్డి, కరీంనగర్ జిల్లా అద్యకులు పడాల రాహుల్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, తన పైన నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు, తనదైన శైలిలో బాధ్యతలను నిర్వహిస్తానని తెలిపారు. భవిష్యత్తులో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరుద్యోగుల పట్ల రాజీలేని పోరాటాలు చేస్తానని తెలిపారు. తన పదోన్నతికి సహకరించిన కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు బీనవెని రాకేష్, హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# నన్ను సంపుకుంటారో.. సాదుకుంటారో మీ ఇష్టం

### బిజెపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భోగ శ్రావణీ

**జగిత్యాల నవంబర్ 08 (ప్రజా మంటలు) :** జగిత్యాల నియోజకవర్గ బిజెపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భోగ శ్రావణీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దొర అహంకారాన్ని అణిచివేసేందుకు వస్తున్నా... నన్ను సంపుకుంటారో... సాదుకుంటారో... మీ ఇష్టం. ఒక్కసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి. 40 ఏళ్లుగా జరగని అభివృద్ధిని చేసి చూపిస్తా. 'అల్లరి' మూకలను దూరం చేసి జగిత్యాలను శాంతికి నిలయంగా మారుస్తా. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా తన నామినేషన్ ను దాఖలు చేశారు. జగిత్యాల పట్టణంలోని కృష్ణా నగర్ లో గల తమ నివాసం నుంచి భారీ సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులతో కలిసి జగిత్యాల పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో ముందుగా విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా కొత్త బస్టాండ్ వరకు వచ్చారు. అక్కడ నిజామాబాద్ ఎంపీ, కోరుట్ల బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ తో కలిసి కొత్త బస్టాండ్ నుంచి టవర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ప్రజలను అభ్యర్థించారు. అనంతరం జగిత్యాల బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ భోగ శ్రావణీ మాట్లాడుతూ రోజులు, వ్యక్తులు, విధానాలు మారుతున్నాయని, ప్రజలు కూడా జగిత్యాలలో మార్పును కోరుకుంటున్నారని అన్నారు. ఆ మార్పు బీజేపీతోనే సాధ్యమని అన్నారు. గతంలో ఉగ్రవాద దాడులు జరిగాయి. దేశంలో గతంలో జరిగిన ఉగ్రదాడుల్లో జగిత్యాలలో ఉగ్ర మూలాలు ఉండేవని, ఇప్పటివరకు పాలించిన వారే వారిని పెంచి పోషించారని అన్నారు. ఎన్ఐఏ సోదాలు కూడా జరిగాయని గుర్తు చేశారు. పీఎఫ్ఐ లాంటి ఉగ్రవాద సంస్థలను పెంచే పోషించలేదా అని ప్రశ్నించారు. స్థానిక పోలీసు సోదరులను, వారి కుటుంబ సభ్యులను కొంత మంది ఎంఐఎం మూకలు బెంబేలెత్తించి ఇక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసారని అన్నారు. ఈ పాలకుల వల్ల పోలీసులకే న్యాయం జరిగినప్పుడు సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని, ఈసారి ఎన్నికల్లో మార్పును



చూస్తారని అన్నారు. జగిత్యాలను శాంతికి నిలయంగా మారుస్తానని అన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని, ప్రజల కోసం తాను కలబడి, నిలబడి ఉంటానని పేర్కొన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సహించలేకనే తాను పార్టీ వీడి ప్రజల్లోకి వచ్చానని, నన్ను సంపుకుంటారో లేక సాదుకుంటారో మీ ఇష్టమేనని అన్నారు.

### జగిత్యాలకు 40 ఏళ్లుగా ఏం చేశారు..?

ఇప్పటివరకు 40 ఏళ్లుగా పాలించిన కాంగ్రెస్ పార్టీ జగిత్యాలలో ఏం చేసిందని ప్రశ్నించారు. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ 2014లో అనధికారంగా, 2018లో అధికారికంగా పనిచేసి రజకారుల పాలనను తలపించారన్నారు. మార్పు కోసం తాను వస్తున్నానని, వారిలాగా నేను డబ్బులు పంచలేనని, కానీ ప్రజల కన్నీళ్లు మాత్రం చూస్తానని, ప్రజల బిడ్డగా ఉంటానని అన్నారు. జగిత్యాల లో పేరుకే అభివృద్ధి అని, ఇన్ని రోజుల్లో ఎమ్మెల్యే చేసింది ఏమీ లేదని అన్నారు. ఇప్పటివరకు జగిత్యాలలో పూర్తిస్థాయిలో రహదారి విస్తరణ జరగలేదని, అభివృద్ధి అంతంత మాత్రమే జరిగిందని అన్నారు. తనని గెలిపిస్తే మామిడి మార్కెట్ ను అభివృద్ధి చేసి ఇక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ తీసుకువస్తానని అన్నారు. ఇప్పటివరకు 20 సంవత్సరాలు 40 సంవత్సరాల్లో అదే నాయకత్వం, అదే వ్యవస్థ ఉందని, ప్రస్తుతం 20 రోజులు తనతో నడవాలని, వచ్చే ఐదేళ్లు ప్రజలతో ఉంటానని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జగిత్యాల నియోజకవర్గం వర్గాన్ని సువర్ణ అక్షరాలతో లిఖిస్తానని అన్నారు. జగిత్యాల నియోజకవర్గం ప్రజలు గల్లా ఎగరేసుకునే విధంగా పనిచేస్తానని అన్నారు. దొర అహంకారానికి బలై కన్నీటితో ఉన్నప్పుడు జగిత్యాల ప్రజలు తనను ఓదార్చరని గుర్తు చేశారు. ప్రస్తుతం దొర పాలనను అంతమొందించడానికి, ప్రతి ఒక్కరికి సామాజిక న్యాయం అందించడానికి తాను వస్తున్నానని, ప్రజలు ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు.

# సికింద్రాబాద్ బీజేపీలో ముసలం

### బీజేపీ రెబల్ అభ్యర్థిగా 'బండపెల్లి సతీష్'



**సికింద్రాబాద్ నవంబర్ 08 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ బీజేపీలో కలకలం రేగింది. ఏండ్ల తరబడిగా పార్టీని నమ్ముకొని, క్షేత్రస్థాయిలో పార్టీని కాపాడుకుంటూ వస్తున్న తనకు సికింద్రాబాద్ బీజేపీ టికెట్ ఇవ్వ కుండా, అసమర్థుడైన నాయకుడికి, ప్రజా మద్దతు లేని సారంగపాణి కి టిక్కెట్ ఇవ్వడం పట్ల బీజేపీ సీనియర్ నేత బండపెల్లి సతీష్ విస్మయం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన నామాలగుండు లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ..కార్పొరేటర్ గా గెలవలేని, పార్టీలో స్థిరంగా లేని వారికి టికెట్లు ఇవ్వడం సరికాదన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయం విని క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు షాక్ తిన్నారని అన్నారు. కోవిడ్ సమయంలో పార్టీ కార్యకర్తలకు, సికింద్రాబాద్ ప్రజలకు అనేక సేవా, స్వచ్ఛంద కార్యక్రమాలను అమలు చేసినట్లు గుర్తు చేశారు. సర్వే ఫలితాల ఆధారంగా టికెట్ కేటాయింపు జరుగుతుందని నమ్మించిన అధిష్టానం చివరికి పది పార్టీలు మారిన వ్యక్తికి, ఒక్క శాతం ప్రజల మద్దతు కూడ లేని వ్యక్తికి టికెట్ ఎలా కేటాయించిందని బండపల్లి సతీష్ సూటిగా ప్రశ్నించారు. తనను నమ్ముకొని పార్టీలో ఉన్నవారికి అనేక అనుమానాలు జరిగినప్పటికీ సహనాన్ని ఎప్పుడు కోల్పో లేదన్నారు. తనకు టికెట్ ఇవ్వకపోవడం పట్ల నిరసిస్తూ, పార్టీ శ్రేణులంతా మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధపడితే, తానే నిలవరించా నని చెప్పారు. క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకునే బీజేపీ కి చెడ్డపేరు రావద్దనే ఉద్దేశ్యంతో ఇప్పటి వరకు సహనంతో ఉన్నామన్నారు. మిత్రులు, శ్రేయోభిలాషులు, సహచర నాయకుల సూచనల మేరకు తన ఆత్మ ప్రభోదానుసారంగా సికింద్రాబాద్ నుంచి బీజేపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ఎప్పటికీ తనకు ప్రధాని నరేంద్రమోడీ, హోం మంత్రి అమిత్ షా లు ఆదర్శమన్నారు. బీజేపీ తిరుగుబాటు అభ్యర్థిగా గెలిచిన వెంటనే తాను బీజేపీ ఎమ్మెల్యేగా కొనసాగుతానని బండపెల్లి సతీష్ స్పష్టం చేశారు.

## హమాలీలకు ఈపీఎఫ్ సౌకర్యం కల్పిస్తాం

### ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**జగిత్యాల నవంబర్ 08 (ప్రజామంటలు):** పట్టణానికి చెందిన హామాలీలు బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రం లోని ఇందిరాభవన్ లో జీవన్ రెడ్డి నీ కలిసి మద్దతు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని జీవన్ రెడ్డికి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ....కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హమాలీలకు ఈపీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ ఇస్తున్నట్లుగానే, దినసరి కూలీలు, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు ఈపీఎఫ్ సౌకర్యం కల్పిస్తాం. దినసరి కూలీలు పని దొరికిన చోటకు వెళ్తుండడంతో ప్రోవిడెంట్ ఫండ్ సౌకర్యం లభించడం లేదు. దినసరి కూలీల గురించి ప్రభుత్వాలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. దినసరి కూలీలకు 2500 పెన్షన్ కల్పించాలని కూలీలు కొంత మొత్తం జమ చేస్తే మరి కొంత ప్రభుత్వం జమ చేయాలని 60 సంవత్సరాలు నిండిన తర్వాత పెన్షన్ సౌకర్యంతో కూలీలకు ధీమా లభిస్తుందని అన్నారు. ఇల్లు లేని వారికి ఇంటి నిర్మాణం కోసం రు.5 లక్షలు ఇస్తామని చెప్పారు. మీ భవిష్యత్ తీర్చి దిద్దే బాధ్యత నాది అంటూ కూలీలకు జీవన్ రెడ్డి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్ హమాలీలు పాల్గొన్నారు.

## నామినేషన్ సమర్పించిన బిఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు

### నామినేషన్ ప్రక్రియకు పోటాపోటీగా తరలిన కార్యకర్తలు





**హుస్నాబాద్ నవంబర్ 08 (ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వొడితల సతీష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ బుధవారం నామినేషన్ వేశారు టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సతీష్ కుమార్ సింగాపురంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి హుస్నాబాద్ ఎల్లమ్మ ఆశీస్సులు తీసుకొని మున్సిపల్ ఆఫీసు నుండి ర్యాలీగా హుస్నాబాద్ ఆర్డిఓ ఆఫీస్ లో నామినేషన్ సమర్పించారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ గౌడ్ చిగురు మామిడి మండలం సుందరగిరి గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించే హుస్నాబాద్ ఆర్టీసీ డిపో క్రాస్ నుండి ర్యాలీగా హుస్నాబాద్ ఆర్డిఒ ఆఫీసు చేరుకుని నామినేషన్ సమర్పించారు. వివిధ మండలాల నుండి వచ్చిన నాయకులు కార్యకర్తలు, పెద్ద ఎత్తున తరలి రావడంతో హుస్నాబాద్ పట్టణం కిక్కిరిసి పోయింది.

## మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ దాఖలు







### బీఆర్ఎస్ నుండి డా. సంజయ్, బీజేపీ నుండి అరవింద్, కాంగ్రెస్ నుండి నర్సింగారావు నామినేషన్లు దాఖలు

**కోరుట్ల నవంబర్ 08 (ప్రజామంటలు):** కోరుట్ల నియోజకవర్గంలో ఈ రోజు మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఇందులో బీఆర్ఎస్ తరపున కల్వకుంట్ల సంజయ్, బీజేపీ తరపున ధర్మపురి అరవింద్, కాంగ్రెస్ నుండి జువ్వాడి నర్సింగారావు లు ఉన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ మాట్లాడుతూ పోట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కెసిఆర్ హయాంలో ఎంతో అభివృద్ధి చెందిందని అలాగే కోరుట్ల నియోజకవర్గం కూడా ఎమ్మెల్యే విద్యా సాగర్ రావు అభివృద్ధి పథంలో నడిపించాడని నేను ఇక్కడ పుట్టిన బిడ్డను ఎక్కడి నుండో రాలేదని అభివృద్ధి చూసి ఓటు వేయాలని నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే ఇంకా నియోజకవర్గంను వంద శాతం అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి జువ్వాడి నర్సింగా రావు మాట్లాడుతూ మా నాన్న రత్నాకర్‌రావు హయాంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని మేము అధికారంలోకి రాగానే షుగర్ ఫ్యాక్టరీ తెరిపించడానికి కృషి చేస్తామని తెలిపారు. బీజేపీ పార్టీ అభ్యర్థి అరవింద్ తరపున జెఎన్ వెంకట్ నామినేషన్ వేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లో రాష్ట్రాలను అభివృద్ధి పథంలో ఉంచిందని కోరుట్ల నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



కొత్త ఆట మొదలైంది
కోరుకో గుర్రాన్ని
ఓటు హక్కు కళ్ళాన్ని
ఒడుపుగా పట్టుకుని

ఏమరుపాటుగ ఉంటే
ఏత్తేస్తది ఆ గుర్రం
జాతి గుర్ర రాజాన్ని
జాగ్రత్తగ ఎంచుకో

ఐదేళ్ల కు ఒక సారి
ఆటలాడు గుర్ర మొద్దు

గడ్డి తినే గుర్రమే
నక్క వినయాలు
చూపిస్తది
బోల్తా కొట్టిస్తది
బొంద వెట్ట సూస్తది
తాత్కాలిక సుఖాలకు
తలుపులనే తీస్తది

డబ్బులిచ్చి మురిపిస్తది
మాటలతో మరిపిస్తది
లొంగితే నీ బతుకు
ఐదేళ్లు వంగుడే

అభివృద్ధే కావాలంటే
అసలు సిసలు గుర్రాన్ని
ఆలోచించి ఎంచుకో.

రాపర్తి శ్రీనివాస్, సెల్: 6300382718.
సహాయ ఆచార్యులు తెలుగు
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల.

# జగిత్యాలలో 7 నామినేషన్లు దాఖలు







**జగిత్యాల నవంబర్ 08 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బండారి (బొగ) శ్రావణి తో పాటు బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి బల్కం మల్లేష్ నామినేషన్ వేశా రు. వీరు కాకుండా స్వతంత్ర అభ్యర్థులుగా తూము తిరుపతి, సబ్బు జగన్, భూఖ్య నందు, దుబ్బ చైతన్య కుమార్, మహ్మద్ జామీల్ నామినేషన్ వేశారు.

## బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు..



**మహదేవపూర్ నవంబర్ 08 (ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్ కుంభం పద్మ బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంథని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్ బాబు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు, మండల అధ్యక్షులు అక్బర్ ఖాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మతిన్ ఖాన్, ఎంపీపీ బి రాణి బాయ్, పిఎసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు నెన్నల గట్టయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు కదార్ల నాగరాజు, హరీష్, శ్రీకాంత్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీలవి ప్రజావంచక ప్రభుత్వాలు

**మాది సంక్షేమ, సంపద సృష్టించిన ప్రభుత్వం**

**నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కుమార్**




**జగిత్యాల నవంబర్ 08 (ప్రజామంటలు):** కాంగ్రెస్, బీజేపీలవి ప్రజావంచక ప్రభుత్వాలని, రాష్ట్రాన్ని, దేశాన్ని ఏలిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజల్ని అన్ని రంగాల్లో వంచించారని, కాని రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేసి రాష్ట్రంలో సంపద సృష్టించామని ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని మోతె రోడ్డులో గల పార్టీ కార్యాలయంలో రాయికల్ పట్టణ బిజెపి కార్యదర్శి కుర్మా ప్రేమ్ రెడ్డి,మండలంలోని కట్కా పూర్ కి చెందిన ఏబివిపి రాష్ట్ర కన్వీనర్ మల్లేష్ యాదవ్,మూటపెల్లి,జగిత్యాల అర్బన్ మండల పలు గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ల నుండి బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్లో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్లో చేరిన వారికి ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... రాష్ట్రంలో అమలవుతున్న కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, ఆసరా, రైతు బంధు, రైతు బీమా, దళితబంధు వంటి ఏ ఒక్క సంక్షేమ పథకంలో కూడా కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి వాటా లేదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనులపై కేంద్రం 18శాతం జీఎస్టీ వసూలు చేస్తుందని, వసూలు చేసిన జీఎస్టీ నుండి రాష్ట్రానికి రావాల్సిన వాటాను ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందన్నారు. జీఎస్టీ పేరుతో రాష్ట్ర ఖజానాను కేంద్రం ఖాళీ చేస్తుంటే సీఎం కేసీఆర్ వివిధ పథకాల ద్వారా రాష్ట్రంలో సంపద సృష్టిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు పరుస్తున్నారన్నారు. పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో అధికార వికేంద్రీకరణ జరుగాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ జిల్లాల ఏర్పాటు చేశారన్నారు. జగిత్యాలను జిల్లాగా మార్చడంతో కలెక్టర్ నుండి మొదలుకొని ప్రతి ప్రభుత్వాధికారి జగిత్యాలలోనే నిత్య ప్రజలకు అందుబాలో ఉండటం వల్ల ప్రజల చెంతకు పాలన వచ్చిందని, జిల్లా అధికార యంత్రాంగం అందుబాటులో ఉండటంతో పర్యవేక్షణ, జవాబు దారీతనం పెరిగి ప్రజలకు వేగవంతమైన పాలన, సత్వర సేవలు అందుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న పెన్షన్లు, వచ్చిన తర్వాత ఎన్ని పింఛన్లు, పించన్‌మొత్తం ఎంత ఇస్తున్నామనే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. ఆసరా పింఛన్, వికలాంగులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు పింఛన్, రైతు బంధు వంటి సంక్షేమ పథకాల వల్ల గ్రామాల్లో ఉన్న దుకాణాల్లో ఖాతాలు, ఎరువుల దుకాణాల్లో అప్పులు లేకుండా పోయాయన్నారు. గతంలో రూపాయి సాయం చేయని కాంగ్రెస్ నాయకుడు జీవన్ రెడ్డి ఆడబిడ్డల పెండ్లికి తులం బంగారం ఇస్తనని ప్రచారం చేస్తుంటే ప్రజలు నవ్వుతున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధిపథంలో సాగుతున్నాయని, ఉద్యోగులకు సైతం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వేతనాలను ఇస్తున్నామని, కరోనా సంక్షోభసమయంలో కూడా ఉద్యోగులకు వేతనాలు, పింఛన్లు సకాలంలో అందించిన ఘనట సీఎం కేసీఆర్ దన్నారు. దేశంలోని 750 జిల్లాలో జగిత్యాల నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు.

## ఏన్కపల్లిలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**మహదేవపూర్ నవంబర్ 08 (ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం లోని ఏన్కపల్లి గ్రామంలో ఎస్సై రాజ్ కుమార్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటిని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు అనంతరం ప్రధాన కూడలిలో ప్రజలతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎస్సై మాట్లాడుతూ.... రానున్న ఎలక్షన్స్ నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్ గురించి వివరించారు. సోషల్ మీడియాలో ఎవరైనా అసభ్యకర పోస్టులు పెడితే వారిపై చట్టపరమైన కేసు నమోదు చేయబడతామని హెచ్చరించారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసు లకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే మావోయిస్టుల సమాచారం అందించిన వారికి తగిన నగదు బహుమతి ఇవ్వబడుతుందని వారి యొక్క వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. నిషేధిత పదార్థాలైన గుట్కా గుడుంబా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కానిస్టేబుల్స్ సిఆర్ పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



## హుస్నాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా పొన్నం ప్రభాకర్ నామినేషన్

**మద్దతుగా నిలిచిన మాజీ ఎమ్మెల్యేలు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, చాడ వెంకటరెడ్డి**






**హుస్నాబాద్ నవంబర్ 08 (ప్రజామంటలు):** హుస్నాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి, సీపీఐ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మద్దతుతో నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులతో కలిసి అశేష జన వాహిని, కోలాహలం, లంబాడీ నృత్యాలు, డప్పు చప్పుళ్ళు, అభిమానుల అవధులు లేని సంతోషాల మధ్య హుస్నాబాద్ అసెంబ్లీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ భారీ ర్యాలీ నిర్వహించి తన నామినేషన్ దాఖలు చేశారు. ఈరోజు హుస్నాబాద్ పట్టణం కాంగ్రెస్ పార్టీ అధికరంలోకి రావడం ఖాయం అని పేద బడుగు వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని మహిళలు, కార్మికులు, ఉద్యోగులు అందరూ కలిసి తమ నాయకుడు తెలంగాణ బిల్లు ఆమోదం కోసం పెప్పర్ స్ప్రే దాడి చేసిన భయపడకుండా తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుడు మా పొన్నం ప్రభాకర్ అని తెలిపారు. కనివిని ఎరుగని రీతిలో హుస్నాబాద్ పట్టణం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులతో కిక్కిరిసింది. అధికార పార్టీ గుండెల్లో రైళ్లు పరుగడుతున్నాయి. పొన్నం ప్రభాకర్ గెలుపు ఖాయం అంటున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, రాష్ట్ర నాయకులు,జిల్లా నాయకులు, సహకార సంఘం నాయకులు,నియోజక వర్గ 7 మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సోషల్ మీడియా విభాగం, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బీఎస్పీ ప్రచార రథాలను ప్రారంభించిన పల్లె ప్రశాంత్ గౌడ్



**జమ్మికుంట నవంబర్ 08 (ప్రజామంటలు )** హుజురాబాద్ నియోజకవర్గం లో బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె ప్రశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఏనుగు గుర్తు ఉన్న ప్రచార రథాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.... బహుజనుల ఐక్యత కోసం, సమ సమాజ స్థాపన కోసం ప్రజలంతా ఏనుగు గుర్తుకు ఓటేయ్యాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో హుజరాబాద్ ఇన్చార్జి వాసాల రామస్వామి, నాయకులు మేకల రవీందర్, మారపల్లి మొగిలయ్య, స్వప్న, కుమార్ యాదవ్, శ్రీనివాస్, రఘు, మహేష్ దిలీప్ గౌడ్, వీణవంక మండల అధ్యక్షులు కొంగల కుమార్ యాదవ్, ఇల్లంతకుంట నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయమునకు రూ. 25,116 విరాళం



**కొడిమ్యాల నవంబర్ 08 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రంలో పునర్నిర్మాణం జరుగుతున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయమునకు గ్రామానికి చెందిన జంగ లస్మయ్య - భూమక్క కుటుంబం ఆలయ నిర్మాణం నకు శాశ్వత చందాదారులుగా 25,116 (ఇరవై ఐదు వేల ఒక వంద పదహారు రూపాయలను) ఆలయ నిర్మాణం కొరకై విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణానికి ఆర్థికంగా సహకరించిన కుటుంబానికి అర్చకులు నాగరాజు రమేష్ స్వామి వారి తీర్థ ప్రసాదములు అందజేసి మంగళ శాసనములతో ఆశీర్వదించారు. దాతల కుటుంబానికి గ్రామస్తుల, భక్తుల, నిర్మాణ కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## హస్తం పేదల నేస్తం

**సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉప్పుల సాంబశివారెడ్డి**



**జమ్మికుంట నవంబర్ 08 (ప్రజామంటలు):** కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా మడిపల్లి గ్రామంలో సోనియా గాంధీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను ఇంటింటికి గడపగడపకు తిరుగుతూ చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలొ మాడిపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు మరియు యువత పల్గున్నారు- ఐలోని సాంబశివ రెడ్డి, ఎగ్గటి సదానందం, మైకమల అశోక్, చెన్నబోయిన రమేష్, సూర్య తేజ, మధు, పురుషోత్తం రెడ్డి, మల్లా రెడ్డి, అరుణ్, మేకల రమేష్, మర్రి శ్రీను, రామిడి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వొడితల ప్రణవ్ కోసం హుజూరాబాద్ లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తాం అని కాంగ్రెస్ నాయకులు తెలిపినారు.



మల్లాపూర్ మండల ఓబులాపూర్ గ్రామంలో రేవంత్ రెడ్డి పుట్టినరోజును ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో పల్లె శేఖర్, చల్ల లింగన్న, గజ్జి రాజు, గడ్డం రాజేందర్, కొండ్లె రాజారెడ్డి, రాజు,పల్లె గంగన్న, బాజా గౌడ్, సోమయ్య, రాజేశం, తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం అమ్మిన, సరఫరా చేసినా కేసులు నమోదు

**ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్**



**జమ్మికుంట నవంబర్ 08 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర సాధారణ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని డిప్యూటీ కమిషనర్ ఎక్సైజ్ కరీంనగర్ ఆదేశాల మేరకు జమ్మికుంట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాలైన జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల్లో ఎన్నికల కోడ్ అమలులో లోబడి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు అక్రమంగా మద్యం అమ్మగా నాటు సారాయి అమ్మగావు అమ్మిన వారిపై దాడులు చేసి మొత్తం 184 కేసులు నమోదు చేయడం జరిగింది. 190 లీటర్ల నాటు సారాయి, 28444 లీటర్ల బెల్లం పానకం 576 కిలోల బెల్లం మరియు 278 లీటర్ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని, మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేయడం జరిగింది. మూడు మండలాల్లో 130 మందిని అక్రమంగా మద్యం నాటు సారా యి అమ్మకుండా ముందస్తుగా తహసిల్దార్ వద్ద బైండోవర్ చేశామన్నారు. అక్రమంగా మద్యం అమ్మిన, నిల్వ చేసిన నాటు సారాయి, గంజాయి సరఫరా చేసిన ఎన్నికల నిబంధనలో భాగంగా వారిపై చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్ హెచ్చరించారు. అటువంటి సమాచారం ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ 8019263862 లేదా జమ్మికుంట స్టేషన్ సిఐ నెంబర్ 8712658812 కు సమాచారం ఇవ్వగలరని, ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## భారతీయ జనతా పార్టీలో చేరిన మాజీ నాయకులు

**ఇబ్రహీంపట్నం నవంబర్ 8 (ప్రజామంటలు).** భారతీయ జనతా పార్టీ కోరుట్ల నియోజకవర్గ అభ్యర్థి ధర్మపురి అరవింద్ సమక్షంలో నానం రాజిరెడ్డి మాజీ జడ్పీటీసీ మల్లాపూర్, కరీంనగర్ జిల్లా రైతు శ్రేయస్సు కమిటీ కార్యవర్గ సభ్యులు, కోరుట్ల రాములు మాజీ ఎంపీపీ మల్లాపూర్ మరియు తేలు లక్ష్మి ముత్తన్న మాజీ ఎంపీపీ ఇబ్రహీంపట్నం బాస లీడర్ సాయన్న ఇబ్రహీంపట్నం సీనియర్ నాయకులు భాజపా లో చేరారు.



## నామినేషన్ వేసిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్




**జమ్మికుంట నవంబర్ 08 (ప్రజామంటలు ):** హుజరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్ బాబు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ప్రచారానికి వెళ్లిన క్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు యువత ఆదరిస్తున్నారని ఎట్టి పరిస్థితులలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దదింపడానికి ప్రతి ఒక్కరూ సైనికుడల పని చేయాలని దీవించాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. తన వెంట ఐదు మండలాల అధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పత్తి కృష్ణారెడ్డి, అరకాల వీరేశలింగం, తుమ్మేటి సమ్మిరెడ్డి, పూజారి రేణుక, సొల్లు బాబు, కాసు బొజ్జల వెంకన్న, మైనార్టీ నాయకులు సలీం పాషా హుజూరాబాద్ నియోజకవర్గం ప్రజలు, నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అంతమే బీజేపీ పంతం

**ఉచిత విద్య వైద్యం మా లక్ష్యం**

**ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్**

**సుపరిపాలన సమర్థవంత నాయకత్వం**

**బిజేపి ధ్యేయం**

**బిఅరెస్ కాంగ్రెస్ లు ఒకరికి ఒకరు బి టీంలు**

**ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటెల**





**భూపాలపల్లి ప్రతినిధి నవంబర్ 08 (ప్రజామంటలు):** బంగారు తెలంగాణ అంటూ రాష్ట్రాన్ని బతుకలేని తెలంగాణా గా మార్చిన బిఅరెస్ పార్టీని పాతాళంలో బొంద పెట్టడమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని బిజెపి ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. భూపాలపల్లి బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి కీర్తిరెడ్డి నామినేషన్ లో పాల్గొన్న ఆయన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన అధికార బిఅరెస్ పై తనదైన శైలిలో నిప్పులు చెరిగారు. ఈ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తామంటూ గొప్పలు పలికిన కేసీఆర్ అప్పుల తెలంగాణా గా మార్చాడని పుట్టబోయే ప్రతిబిడ్డ ఒక లక్ష పై చిలుకు అప్పుతో పడుతోందని దుయ్య బట్టారు. ఆయన మాటలు కోటలు దాటుతాయి కానీ కాళ్ళు తంగాళ్లు దాటవని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నేరవేర్చని చేతకాని ప్రభుత్వమని. నియామకాల కోసం కొట్లాది తెచ్చుకున్న తెలంగాణలో నియామకాలు లేక నిరుద్యోగ విద్యార్థి యువత, ఇంకా తల్లిదండ్రులకు భారం కాకూడదని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. భారతీయ జనతా పార్టీని ఆశీర్వదించండి ప్రతి ఆరు నెలలు ఏడాదికి ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తామని నిరుద్యోగ విద్యార్థి యువత నిరాశ పడవద్దని పిలుపునిచ్చారు. బినేపికి ఓటు వేసి ఆశీర్వదిస్తే ఇంట్లో ఇద్దరికీ పింఛన్లు, రైతులకే కాదు రైతు కూలీలు, ఇతరులకు కూడా బీమా సోకర్యం, ఉచిత విద్య, వైద్యం, అందిస్తామని హామీ ఇచ్చారు. సింగరేణిలో ప్రయివేటు వ్యవస్థ రద్దు చేస్తామన్నారు బిఅరెస్ కాంగ్రెసులు ఒకే తాను ముక్కలని వారు ఒకరికి ఒకరు బి టీం లని ఎద్దేవా చేశారు. తెలంగాణ యావత్ సమాజాన్ని మోసం చేసిన బిఅరెస్‌ను పొలిమెరాలు దాటించాలని, అదే సమయంలో కాంగ్రెస్ కు ఓటేస్తే అది బిఅరెస్ కు వేసిన ట్టేనని అంటూ గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే లు బిఅరెస్ లో కలిసిన విషయాలను గుర్తు చేస్తూ ఈ సారి మీ ఇంటి ఆడ బిడ్డ కీర్తిరెడ్డి కి ఓటు వేసి గెలించాలని ఆమెకు వేసే ప్రతి ఓటు ఈటెలకు వేసినట్టేనన్నారు. పగటి వేషగాళ్లకు బుద్ధి చెప్పాలి. పూటకో పార్టీ మార్చే పగటి వేష గాళ్లను తరిమి కొట్టాలని ఓట్ల కోసం మన ఇండ్ల ముందుకు వస్తే ఏ పార్టీ అంటూ అడగాలని గతంలో ఏ పార్టీ గుర్తు చేయాలని వాళ్ళు తమ బాగుకోసం అధికారం కోసం పార్టీలు మార్చే వేషగాళ్లని కడిగి పారేశారు. ఈ సమావేశంలో ఎన్నికల ఇంచార్జ్ మాధవన్, బిజెపి జిల్లా అధ్యక్షుడు కన్నం యుగదీశ్వర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్, భారీగా కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ అధికారులచే 11 లీటర్ల మద్యం, 80 కిలోల బెల్లం పట్టివేత



రాయికల్ అక్టోబర్ 08 (ప్రజామంటలు): జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, పి. శ్రీధర్, ఆదేశానుసారం, జగిత్యాల ఎక్సైజ్ స్టేషన్ పరిదిలోని రాయికల్ మండలంలోని భూపతి పూర్ (ఎక్స్) రోడ్డు వద్ద జగిత్యాల ఎక్సైజ్ సి.ఐ. యస్.ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించగా రాయికల్ నుండి ఒడ్డెలింగపూర్ వైపు వెళ్తున్న మంత్యానాయక్ తండా కు చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై ప్రభుత్వ నిషేధిత నాటుసారా తయారీకి వాడే బెల్లాన్ని రవాణా చేస్తూ పట్టుబడ్డారు వీరి దగ్గరి నుండి (80) కిలోల బెల్లంతో పాటు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అదేక్రమంలో కొత్తపేట ఒడ్డెరకాలనికి చెందిన సూర రాజ నర్సయ్య అనే మరొక వ్యక్తి ద్విచక్ర వాహనం పై మద్యాన్ని రవాణా చేస్తుండగా పట్టుకున్నారు ఇతని దగ్గర నుండి (11.04) లీటర్ల మధ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేశారు. తదుపరి రాయికల్ మండలంలోని మంత్యానాయక్ తండా శివారు లోని అటవీ ప్రాంతంలో (200) లీటర్ల బెల్లం పానకం, ఉప్పుమడుగు గ్రామ శివారు లో (1000) లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. ఈ తనిఖీలలో జగిత్యాల ఎక్సైజ్ యస్.ఐ. లు సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి సత్యవతి రాథోడ్ వ్యాఖ్యలు అర్ధరహితం

### బీజేపీ మహిళా నాయకురాలు సాంబారి కళావతి



జగిత్యాల నవంబర్ 08 (ప్రజామంటలు): భారతీయ జనతా పార్టీ ఎస్టీలకు ద్రోహం చేసిందని మంత్రి సత్యవతి రాథోడ్ చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని కాంగ్రెస్, బిఆరెస్ పార్టీలే ఎస్టీలను మోసం చేశాయని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబారి కళావతి విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదిన్నర ఏళ్లలో హరిజనులను, గిరిజనులను, ఆదివాసీలను అక్కున చేర్చుకొని దేశంలోని పద్దెనిమిది వేల గిరిజన తండాలకు, గూడెలకు మౌలిక సదుపాయం అయినా విద్యుత్ సౌకర్యం కల్పించిందన్నారు.ఎస్సీ, ఎస్టీలను దేశ ప్రథమ పౌరులను చేసిందని కేంద్ర మంత్రివర్గంలో 12 మంది ఎస్సీలను 8 మంది ఎస్టీలను కేంద్రమంత్రులను చేసిన ఘనత బీజేపీ పార్టీదేనన్నారు. తెలంగాణా రాష్ట్రానికి గిరిజన విశ్వవిద్యాలం మంజూరు చేసిందని అన్నారు.కాంగ్రెస్ 65 ఏళ్ల పాలనలో కనీస సౌకర్యాలు కల్పించలేని దుర్మార్గ పాలన అందించందన్నారు. బిఆరెస్ తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో గిరిజనులకు 12% రిజర్వేషన్ కల్పిస్తామని గిరిజనులు సాగుచేసుకునే పోడు భూములకు పట్టాలిస్తామని మోసం చేసిందని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని బిఆరెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తే అక్రమ కేసులు పెట్టి జైలులో పెట్టింది మంత్రి సత్యవతికి తెలియదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా పంచాయితీలుగా ఏర్పడ్డ తండాలకు, గూడెలకు నిధులు మంజూరు చేయకపోవడం వల్ల వెనుకబడి పోయాయన్నారు. ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.ఈసమావేశంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బండపెల్లి మల్లేశ్వరి మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి మ్యాదరి లక్ష్మి పట్టణ మహిళా మోర్చా నాయకురాళ్లు మమత, మధురిమ,భానుప్రియ, పుష్ప, మానస, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల కాపరి చేతిలో వడ్డెర సంఘ నాయకుని హత్య



ఎల్కతుర్తి నవంబర్ 08 (ప్రజామంటలు): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన గండికోట లక్ష్మణ్ అనే ఒడ్డర సంగం మండల అధ్యక్షుడు ఇటీవల నియామకం అయ్యాడు. ధర్మసాగర్ మండలంలో హత్యకు గురయ్యాడు. గొర్రెల దొంగతనం చేస్తుండ గా యజమాని గొడ్డలితో కొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సభ్యులు వేటకు వెళ్లిన లక్ష్మణ్ ను పొరపాటున దొంగ అనుకొని గొడ్డలితో నరికి హత్య చేశారని ధర్మసాగర్ పీఎస్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

## గాంధీ ఆసుపత్రిలో మరో గుర్తు తెలియని డెడ్ బాడీ

### ఓపీ బ్లాక్ వద్ద వెయిటింగ్ హాల్ లో పడి ఉన్న శవం



సికింద్రాబాద్ నవంబర్ 08 (ప్రజామంటలు): గాంధీ ఆసుపత్రి ఆవరణలో మరో గుర్తు తెలియని వ్యక్తి డెడ్ బాడీ వెలుగు చూసింది. గాంధీ ఓపీ బ్లాక్ పక్కనున్న వెయిటింగ్ హాల్ లో కిందపడి ఉన్న దాదాపు 44 ఏండ్ల వయస్సు కలిగిన మగవ్యక్తి మృతదేహాన్ని చూసిన సెక్యూరిటీ సిబ్బంది వెంటనే చిలకల గూడ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని డెడ్ బాడీని గాంధీ మార్చురీకి తరలించి, కేసు ధర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని డెడ్ బాడీ ని గుర్తించిన వారు తమను సంప్రదించాలని చిలకలగూడ ఎస్.ఐ సబితా విజ్ఞప్తి చేశారు. ఇటీవల గాంధీ ఆసుపత్రి ఆవరణలో వరసగా గుర్తు తెలియని వారు చనిపోతుండగా, వీరిలో చాలా వరకు యాచకులు, అనారోగ్యానికి గురైన వారే ఎక్కువగా ఉంటున్నారు. ఇలా చనిపోతున్న వారి వద్ద ఎలాంటి ఆధారాలు దొరక్కపోతుండటంతో వారి వివరాలు, చిరునామా కనుక్కోవడం పోలీసులకు ఓ సవాల్ గా మారింది. మూడు రోజుల పాటు మార్చురీలో భద్రపరిచి, అనంతరం అనాధ శవాలుగా బావించి అంత్యక్రియలకై డెడ్ బాడీలను జీహెచ్ఎమ్సీ సిబ్బందికి అందచేస్తున్నారు.

## విరాట్ కోహ్లీ.. ఐసీసీ షాట్ ఆఫ్ ది సెంచరీ

గత టీ20 ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ హారీస్ రవూఫ్ బంతికి అద్భుతమైన షాట్ ఆడాడు. ఈ షాట్ చాలా పేరుగాంచింది. హారీస్ రవూఫ్ వేసిన ఫాస్ట్ బాల్‌పై, విరాట్ కోహ్లీ బ్యాక్ ఫుట్‌లో వెళ్లి ముందు వైపు సిక్సర్ కొట్టాడు.ఈ షాట్ తర్వాత బౌలర్‌తో సహ ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లు షాక్‌కు గురయ్యారు. అదే సమయంలో ఇప్పుడు ఐసీసీ విరాట్ కోహ్లీ షాట్‌ను షాట్ ఆఫ్ ది సెంచరీగా పేర్కొంది. విరాట్ కోహ్లీ వీడియోను ఐసీసీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ వీడియోలో %×జజ% – షాట్ ఆఫ్ ది సెంచరీ అంటూ క్యాప్షన్ అందించింది. అయితే, ఇది కాకుండా, విరాట్ కోహ్లీకి సంబంధించిన అనేక ఇతర క్షణాలను ఐసీసీ వీడియోలో పొందుపరిచింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో అంతకంతకూ వైరల్ అవుతోంది. అదే సమయంలో, సోషల్ మీడియా వినియోగదారులు నిరంతరం వ్యాఖ్యానించడం ద్వారా వారి అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు.

# హుస్నాబాద్‌లో కనివిని ఎరుగని విశేష ఆదరణ

### వొడితల నామినేషన్

### గులాబీ మయమైన హుస్నాబాద్

సైదాపూర్ నవంబర్ 08 (ప్రజామంటలు): అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేసిన హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే సతీష్ కుమార్. హుస్నాబాద్ నియోజకవర్గం నలు మూలల నుండి వేలాదిగా తరలివచ్చిన గులాబీ శ్రేణులతో గులాబీ మయమైన హుస్నాబాద్ పట్టణం. బీఆర్ఎస్ పార్టీ భారీ ర్యాలీ. అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామ రక్ష సతీష్ కుమార్ నామినేషన్ కార్యక్రమానికి హాజరైన హుస్నాబాద్ బీఆర్ఎస్ ఇంచార్జ్ పెద్దిరెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి. వినోద్ కుమార్. హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే సతీష్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ నుండి భారీ ర్యాలీగా, నియోజకవర్గం నలుమూలలు, పలు గ్రామాల నుండి వేలాది మంది గులాబీ శ్రేణులు వెంటరాగా, గాంధీ చౌరస్తా, మల్లె చెట్టు చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా మీదుగా హుస్నాబాద్ ఐఓసి కార్యాలయానికి చేరుకొని హుస్నాబాద్ ఆర్డిఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి బెనిషాలోమ్ సమక్షంలో హుస్నాబాద్ బీఆర్ ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. హుస్నాబాద్ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సతీష్ కుమార్–డాక్టర్ షమిత దంపతులు అనంతరం సతీష్ కుమార్ తల్లిదండ్రులు మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంత రావు– సరోజనదేవి ల ఆశీర్వాదం తీసుకొని, సతీష్ కుమార్ కుమారుడు ఇంద్రనీల్, ఇతర కుటుంబ సభ్యులు తరలి రాగా భారీ ర్యాలీగా తరలి వెళ్లి నామినేషన్ వేశారు. హుస్నాబాద్ బీఆర్ఎస్ ఎన్నికల ఇంచార్జ్ పెద్దిరెడ్డి మాట్లాడుతూ.... దేశంలో కేసీఆర్ లాంటి నాయకుడు లేడని, అభివృద్ధి సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామరక్ష అని దేశంలో అన్ని రంగాలలో తెలంగాణ నెం.1 స్థానంలో దూసుకుపోతుందని, ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగించుకోవాలని ప్రతిపక్షాల పార్టీలకుఅభ్యర్థులు కరువయ్యారని, వారి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తెలియదు, ప్రజలను గందరగోళానికి గురిచేయడానికి మళ్లీ వస్తున్నారు వాళ్ళ భ్రమలో పడవద్దని ప్రజలకు సూచించారు. మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గాన్ని గతంలో ఎమ్మెల్యేలుగా ఉన్న కమ్యూనిస్టు, కాంగ్రెస్ పార్టీల వారు అభివృద్ధి చేయలేదని ఎమ్మెల్యే సతీష్ కుమార్ వేలకోట్లతో అభివృద్ధి చేశారని, అలాంటి సతీష్ కుమార్ ను మరొకసారి ఆశీర్వదించి హుస్నాబాద్ ప్రజలందరూ భారీ మెజారిటీతో గెలిపించు కోవా లని



పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్ మాట్లాడుతూ.... కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కేసీఆర్ అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, ప్రతి పక్షాలు కాళ్లల్లో కట్టే పెట్టి అభివృద్ధి నిరోధకులుగా మారారని, ఆనాడు తెలంగాణ గురించి కేసీఆర్, తెలంగాణ ప్రజానీకం, యువకులందరూ కొట్లాడుతూ ఉంటే తెలంగాణ వచ్చేదా, చచ్చేదా అని హేళన చేసిన వారు ఇప్పుడు వచ్చి మేము అభివృద్ధి చేస్తామనడం ఆశ్చర్యంగా ఉందని, వారి మాయ మాటలు నమ్మవద్దని తెలంగాణను చీకట్లోకి నెట్టవద్దని ప్రజలకు సూచించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా సతీష్ కుమార్ గత తొమ్మిది ఏళ్లలో గణనీయంగా అభివృద్ధి చేశారని, గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేశారని, ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగించుకోవాలని గతంలో ఉన్న కమ్యూనిస్టు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నియోజకవర్గానికి ఏమీ చేయలేదని ఇప్పుడు మేము ప్రజలకు సేవ చేస్తామని వస్తున్నారు జాగ్రత్త ప్రజలందరూ వారి మాటలు నమ్మవద్దు. అభివృద్ధి కాముకుడు, నిత్యం ప్రజల శ్రేయస్సుకై తపించే నాయకుడు సతీష్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ.... హుస్నాబాద్ ఎమ్మెల్యేగా 9 ఏండ్లలో నియోజకవర్గాన్ని 9,500 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ రంగాలలో ఘనసీయంగా అభివృద్ధి చేశానని, అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం, అంతర్గత రోడ్లు, మురుగునీటి కాలువలు, ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా త్రాగునీరు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల మరమ్మత్తులు, పల్లె ప్రకృతి వనాలు వైకుంఠధామాలు, బీసీ ఎస్సీ ఎస్టీ గురుకులాలు, మోడల్ స్కూల్లు, పల్లె దవఖానాలు, హుస్నాబాద్ ఆసుపత్రిని అప్గ్రేడ్ చేసుకున్నామని, హుస్నాబాద్ మున్సిపాలిటీని బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకున్నామని, గొర్రెల పంపిణీ కార్యక్రమం, రైతుబంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఇలా అనేక పథకాలు, నియోజకవర్గంలో ప్రతి ఇంటికి బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాయని, ప్రతిపక్ష పార్టీల కల్లబొల్లి మాటలు నమ్మవద్దని ఎలక్షన్ టూరిస్టులు వస్తూ ఉంటారు, పోతుంటారు హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల మధ్య ఎల్లప్పుడూ నేను ఉంటా అని అన్నారు, రానున్న రోజుల్లో ఇంకా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని,హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ మరొకసారి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ తెలియజేస్తూ, హుస్నాబాద్ ప్రజలందరూ అభివృద్ధిని చూసి మరొకసారి ఆశీర్వదించాలని అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును ఎన్నికల తరువాత ప్రారంభిస్తామని తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల నుండి భారీగా హాజరైన గులాబీ శ్రేణులు, మహిళలు యువకులు, ప్రజలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. సైదాపూర్ మండలానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సోమారపు రాజయ్య రాష్ట్ర ఎంపీపీ ఫోరమ్ అధ్యక్షులు సారాబుడ్ల ప్రభాకర్ రెడ్డి కరీంనగర్ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ పేరాల గోపాలరావు వైస్ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి సింగిల్ విండో అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి బిల్లా వెంకట్ రెడ్డి సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కొండ గణేష్ టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి మండల ఉప అధ్యక్షులు లక్ష్మీనారాయణ సర్పంచులు చందా శ్రీనివాస్ కొత్త రాజు రెడ్డి పాపయ్య శిరీష ముకుంద రెడ్డి ప్రత్యూష సరిత రమేష్ సుమలత అశోక్ యుగంధర్ రెడ్డి సుశీల తిరుపతి గౌడ్ అబిడి పద్మ రవీందర్ రెడ్డి అక్షయ శ్రీనివాస్ బత్తుల కొమురయ్య ఏనుగుల ఐలయ్య పద్మజ కొమురయ్య చింతలత కుమార్ స్వామి సునీత రాణి జయకృష్ణ ఎంపీటీసీ సభ్యులు అనిత రవీందర్ రెడ్డి ఓదెలు గాజర్ల భాగ్య సదానందం సీనియర్ మాజీ జెడ్పిటిసి సభ్యులు రవీందర్, నాయకులు ముత్యాల వీరారెడ్డి, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు రావుల రవీందర్ రెడ్డి, రాజు రెడ్డి, వీరారెడ్డి, తిరుపతిరెడ్డి, మహిపాల్ రెడ్డి, కొమురయ్య, యాదగిరి, వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు మహిళా సంఘం అధ్యక్షురాలు దేవేంద్ర, వేలాదిగా సైదాపూర్ మండలం తరలివచ్చిన ఉపసర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఉపసర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మహిళా సంఘం నాయకులు, మహిళా అధ్యక్షురాలు, వివిధ గ్రామాల నుండి టిఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల సోషల్ మీడియా నాయకులు, అందరికీ కార్యకర్తలందరికీ రెండు చేతులు నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలిపిన మండల పార్టీ అధ్యక్షులు రాజయ్య 30వ తారీకు నవంబర్ న కారు గుర్తుపై ఓటేసి సతీష్ కుమార్ అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయనే కార్యకర్తలను ప్రజలను కోరారు.

## నేను మీ అందరివాడిని ఆదరించండి

### ప్రజలకు సేవ చేయడమే నా ముఖ్య కర్తవ్యం

### ఆదరించి ఆశీర్వదించండి

### మీడియా మిత్రులతో ఆత్మీయ సమ్మేళనం

### పాల్గొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కుమార్



జగిత్యాల నవంబర్ 08 (ప్రజామంటలు): ప్రజలకు సేవ చేయడమే నా ముఖ్య సంకల్పం అని జగిత్యాల మీడియా మిత్రులతో అనుబంధం ఈనాటిది కాదని వైద్యుడిగా సేవారంగంలో ఉన్నప్పటి నుంచి ఆత్మీయ అనుబంధం ఉందని మీ అందరి సహకారంతో మొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలిచి ఎంతో అభివృద్ధి చేశానని మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని జగిత్యాల బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డా.సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక విరుపాక్షి ఫంక్షన్ హాలులో మీడియా మిత్రులతో డా. సంజయ్ కుమార్ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ.... జగిత్యాల నియోజకవర్గ ప్రజలు మీడియా మిత్రుల సహకారంతో ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. ఆనాటి నుంచి జగిత్యాల పట్టణ, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతర కృషి చేశానన్నారు. నాలుగున్నర ఏండ్లలో రెండేండ్లు కరోనా మూలంగా నేను చేయాల్సిన అభివృద్ధికి అడ్డుపడిందన్నారు. అయినా వంద పడకల ఆసుపత్రిని ఆరువందల పడకల ఆస్పత్రిగా, మెడికల్ కళాశాల ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే మాతా శిశు ఆసుపత్రి ఏర్పాటు చేసుకోవడంతో ఎందరికో మేలు జరుగుతోందన్నారు. పార్కుల అభివృద్ధి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు ఇంకా ఎన్నో అభివృద్ధి పనులను చెప్పట్టడం జరిగిందని ఆయన చెప్పారు. ప్రతి పనికి అడ్డుపడుతూ అభివృద్ధిని ఆపాలని కొందరు చూశారని మొండిగా బరిలో దిగి వీటన్నిటిని సాధించుకోవడం జరిగిందన్నారు. ధర్మపురి రోడ్డులో సెంట్రల్ లైటింగ్ పనులను చేపడితే నేషనల్ హైవై అథారిటి అధికారులకు ఫిర్యాదు చేసి పోల్స్ తొలగించేలా చేశారని అన్నారు. మీడియా మిత్రులు ఆనాటి నుంచి నాతో ఎంతో ఆత్మీయంగా ఉన్నారని ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ఏనాడు నన్ను బాధించే రీతిలో వార్తలను రాయలేదని అన్నారు. నేను కేవలం వైద్యుడిగా ఉన్న కాలంలో పేషంట్ వస్తే తనతో ఆ చికిత్స అవుతుందా కాదా అని అక్కడే సూటిగా చెప్పడం అలవాటైంది. రాజకీయాల్లోకి వచ్చాక కూడా అదే విధానంలో ఉండడం కొందరిని భాదించి వుండొచ్చన్నారు. అలాగే మీడియా మిత్రుల్లో ఎవరైనా బాధపడివుండే క్షమించాలని కోరారు. మీ చిరకాల స్వప్నం నెరవేర్చాలని నేను సంకల్పంతో ఉన్నానని అది త్వరలోనే సాకారం చేస్తానని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ చెప్పారు. మరోసారి ఎమ్మెల్యేగా ఆదరించి ఆశీర్వదించాలని గెలిపించాలని గెలిచాక మీ వెంటే ఉంటానని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. ఈ మీడియా మిత్రుల ఆత్మీయ సమ్మేళనంలో వంద మందికి పైగా ప్రింట్, ఎలక్ట్రానిక్ స్టాఫర్స్, ఆర్.సి లు, రిపోర్టర్స్, కెమరామేన్స్ పాల్గొన్నారు.

### నేడు నామినేషన్ వేయనున్న

## సనత్ నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తలసాని




సనత్ నగర్ నవంబర్ 08 (ప్రజామంటలు): సనత్ నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈనెల 9 గురువారం తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 9 గంటలకు వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసం వద్ద తన తల్లి లలితా బాయి ఆశీర్వాదం తీసుకొన్న అనంతరం ఫ్యామిలీ మెంబర్స్ తో కలసి తలసాని బైబిల్ హౌస్ సమీపంలోని జబ్బర్ కాంప్లెక్స్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి 9.30 గంటలకు బీఆర్ఎస్ సనత్ నగర్ సెగ్మెంట్ కు చెందిన అశేష సంఖ్యలోని కార్యకర్తలు, అభిమానులతో కలసి భారీ ర్యాలీగా సిటీ లైట్ హెూటల్, బాటా, ప్యాట్నీ, హరిహర కళా భవన్ మీదుగా నార్త్ జోన్ జీహెచ్ఎమ్సీ జోనల్ కమిషనర్ కార్యాలయానికి చేరుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అభ్యర్థి తలసాని శ్రీనివాస యాదవ్ తన నామినేషన్ పత్రాలను అందచేస్తారు. కాగా నామినేషన్ ర్యాలీని వేల సంఖ్యలో కార్యకర్తలతో న:భూతో న:భవిష్యతి రీతిలో కన్నులపండుగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు గత రెండు రోజులుగా ప్రత్యేక ఏర్పాట్లు, భారీగా జనసమీకరణ కు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు.

## అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

### చిగురుమామిడి ఎస్ఐ బి. రాజేష్




చిగురుమామిడి నవంబర్ 08 (ప్రజామంటలు): కొండాపూర్ గ్రామానికి చెందిన దరిపెల్లి లచ్చమ్మ, 73 సంవత్సరం లు, ఇంటికి ఒక గుర్తు తెలియని వ్యక్తి బుధవారం ఉదయం 8 గంటల సమయంలో పల్సర్ మోటార్ సైకిల్ పై వచ్చి, ఆమెతో గ్యాస్ సిలిండర్ సాంక్షన్ అయిందని, మీ ఫోటో తీయాలని, చెవులకు ఉన్న బంగారు కమ్మలు, మాటీలు ఫోటోలో పడవద్దని మాయ మాటలు చెప్పి, పక్కకు పెట్టించి, ఫోటో తీసి గ్యాస్ సిలిండర్ ఎవరైనా చూస్తారు. వేరే రూమ్ లో పెట్టమని చెప్పి, ఆమె వేరే రూములకు పోయిన తర్వాత అట్టి బంగారు వస్తువులు అర్ధ తులం గల వాటిని దొంగిలించుకొని మోటార్ సైకిల్ పై పారి పోయినాడు. కావున చిగురుమామిడి మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా, అపరిచిత వ్యక్తులు గ్యాస్ సిలిండర్ కనెక్షన్ వచ్చినదని మీ ఫోటోలు దిగవలసి ఉంటదని మీ దగ్గరికి వచ్చి మాయ మాటలతో మభ్యపెట్టి ఇంటిలో ఎవరు లేని సమయంలో మీ దగ్గర గల విలువైన వస్తువులను బంగారు వెండి ఆభరణాలను మిమ్మల్ని మోసపుచ్చి దొంగిలించే ప్రయత్నాలు చేస్తున్నారు. మీరు అట్టి అపరిచిత వ్యక్తులను నమ్మకూడదు మరియు వారి మోసాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండగలరని పోలీస్ వారి తరపున మండల ప్రజలకు చిగురుమామిడి ఎస్సై బి. రాజేష్ తెలియజేశారు.

## సనత్ నగర్ బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మర్రి శశిధర్ రెడ్డి



సనత్ నగర్ నవంబర్ 08 (ప్రజామంటలు): సనత్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా మర్రి శశిధర్ రెడ్డి బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గానికి చెందిన బీజేపీ శ్రేణులు నామినేషన్ దాఖలు చేసే సికింద్రాబాద్ జీహెచ్ఎమ్సీ కార్యాలయం సమీపంలోని కోర్ట్ కాంప్లెక్స్ వద్దకు పెద్ద ఎత్తున చేరుకొని మర్రి శశిధర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. మహంకాళి జిల్లా బీజేపీ పరిశీలకులు కర్ణాటకకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే విశ్వనాథ్, మహంకాళి జిల్లా పార్టీ అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, కార్పొరేటర్లు కేతినేని సరళ చీర సుచిత్ర, కొంతం దీపిక లతో కలిసి వెళ్లి శశిధర్ రెడ్డి తన నామినేషన్ ను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందచేశారు. శశిధర్ రెడ్డి మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు అమ్మవారికి 151 కొబ్బరికాయలు కొట్టారు.

## స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా గంప కరుణాకర్ నియామకం



జగిత్యాల నవంబర్ 08 (ప్రజామంటలు): జగిత్యాల స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గా గంప కరుణాకర్ న్యాయవాది ని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారిచేయగా జిల్లా ప్రిన్సిపాల్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీమతి జి. నీలిమ మరియు సీనియర్ సివిల్ జడ్జి కే. ప్రసాద్ వారికీ నియామక పత్రం అందచేసినారు. ఈరోజు వారు పదవి భాద్యతలు స్వీకరించారు. వీరి నియామకం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కే. శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సిహెచ్. రామకృష్ణ, కోశాధికారి కె. చంద్ర మోహన్ మరియు న్యాయవాదులు అందరూ హర్షవ్యక్తం తెలియచేసారు.

# మాదిగల విశ్వరూప మహాసభ కరపత్ర ఆవిష్కరణ



**కోరుట్ల నవంబర్ 08 (ప్రజామంటలు):** నవంబర్ 11 న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో జరుగు మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి. కోరుట్ల అంబేద్కర్ నగర్ లో డాక్టర్ బాబు జగ్జీవన్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ కోరుట్ల పట్టణ ఇంఛార్జి బంగారు ప్రమోద్, మండల ఇంఛార్జి కుంటాల శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో "మాదిగల విశ్వరూప మహా సభ" కరపత్రం బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎంఎస్పి జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం, మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు చేట్ పల్లి లక్ష్మణ్, ఎమ్మార్పీస్ జగిత్యాల జిల్లా కన్వీనర్ సురుగు శ్రీనివాస్ లు హాజరై మాట్లాడుతూ.... ఎస్సి, లలో ఉండే 59, మాదిగ, మాదిగఉపకులాలకు విద్య, ఉద్యోగ,సంక్షేమ, రాజకీయ రంగాలలో జనాభా దామాషా ప్రకారం సమాన వాటా పంపిణీ జరగాలంటే ఎస్సి, వర్గీకరణ తోనే సమాన న్యాయం జరుగుతుందని అన్నారు. వర్గీకరణ ఆవశ్యకతను వివరించి దీనికి మంద కృష్ణ మాదిగ 29, సంవత్సరాలుగా పోరాటం చేయడం జరుగుతుంది. మరియు ఎంఆర్పిఎస్ ఉద్యమ పోరాటం వల్ల సాధించిన సంక్షేమ పథకాలను తెలియజేసి వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సి , రిజర్వేషన్ ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్ తో నవంబర్ 11, న లక్షలాది మందితో "మాదిగ ఉప కులాల విశ్వరూప మహాసభ"ను నిర్వహించడం జరుగుతుంది. ఈ మహా సభకు ముఖ్య అతిథిగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వస్తున్నందున మన జాతి ఆవేదను చాటి చెప్పాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉంది. మన భవిష్యత్తు కొరకై విశ్వరూప మహాసభకు ప్రతి ఒక్కరు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల నియోజకవర్గ ఇన్చార్జి బొనగిరి కిషన్, మెట్టుపల్లి డివిజన్ ఇంఛార్జి దయ్యాల హనుమంత్, మండల నాయకులు లింగంపల్లి నరేష్, జగర్ల మహేష్, బోల్లే వినోద్, అల్లం రాజమౌళి, మనోజ్, చిట్యాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పురిటి గడ్డపై నా ప్రజల రుణం తీర్చుకుంటా

### ఎలబోతారం సర్పంచ్ శిరీష ముకుంద రెడ్డి



**సైదాపూర్ నవంబర్ 08 (ప్రజామంటలు):** సైదాపూర్ మండలంలోని ఎలబోతారం గ్రామంలో బుధవారం ఉదయం గ్రామ శాఖ అధ్యక్షుడు కోయడ రాజేందర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో సైదాపూర్ ఎంపీపీ సారాబుడ్ల ప్రభాకర్ రెడ్డి. సర్పంచ్ శిరీష ముకుంద రెడ్డి. మాట్లాడుతూ.... ఏ రాష్ట్రంలో లేనంతగా మన రాష్ట్రంలో మన బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపనులు. అభివృద్ధి పథకాలు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేశారని కొనియాడారు. ఇంకా మన రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగాలంటే మళ్ళీ బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించి. కెసిఆర్ ను మూడో సారి ముఖ్యమంత్రి ని చేసి హుస్నాబాద్ నియోజకవర్గంలో మళ్లీ వోడితెల సతీష్ కుమార్ ను ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మన రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలనె భావనతో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల బిఆర్ఎస్ మేనిఫెస్టో లో ఉన్న కెసిఆర్ బీమా ఇంటింటికి ధీమా, అన్నపూర్ణ పథకం. ఆసరా పెన్షన్, రైతుబంధు. మహిళా సమైక్యల సొంత భవనాలు. అనాధలకు బాసట, జర్నలిస్టులకు వైద్య బీమా, కేసీఆర్ ఆరోగ్య రక్ష, సౌభాగ్య లక్ష్మి, గ్యాస్ సిలిండర్ రూ. 400, అగ్రవర్ణ పేదలకు గురుకులాలు, మైనార్టీ సంక్షేమం, సిపిఎస్ ఉద్యోగులకు ఓపిఎస్ వర్తింపు, అసైన్డ్ భూములపై ఆంక్షలు ఎత్తివేత లాంటి పథకాలు ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి అని అన్నారు. ప్రచారంలో బిఆర్ఎస్ మహిళా నాయకురాలు రావుల కవిత, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పొడేటి ఎల్లయ్య, కొండపర్తి సమ్మయ్య, అందాసి రాజయ్య, నమిండ్ల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను గుర్తించిన బీజేపీ

### బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభ విజయవంతం

**సికింద్రాబాద్ నవంబర్ 08 (ప్రజామంటలు):** బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభ విజయవంతం కావడం శుభపరిణామమని, బీసీల ఐక్యతకు ఇది నిదర్శనమని బీజేపీ రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ.... రాష్ట్ర జనాభాలో అధికంగా ఉన్న బీసీలకు ఇప్పటికైన గుర్తింపును ఇచ్చిన బీజేపీ రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త ఒరవడిని సృష్టించిందన్నారు. ఈసారి ఎన్నికల్లో గెలిస్తే



రాష్ట్ర ముఖ్యమంత్రిగా బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించడం గొప్ప విషయమన్నారు. బీసీ ఆత్మగౌరవ సభను విజయవంతం చేసిన రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నేతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మీడియా సమావేశంలో రాష్ట్ర బీజేపీ నాయకులు భానుప్రకాశ్ ముదిరాజ్, పొట్లకాయల వెంకటేశ్వర్లు, చింతల వెంకటేశ్, మురళి, శ్రీనివాసరాజు, పొట్లకాయల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ యువతి మృతి

**తరిగొప్పుల నవంబర్ 08 (ప్రజా మంటలు) :** వరకట్న వేధింపులకు వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై డి నరేష్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలానికి చెందిన దివిటి అనిత రాజు దంపతుల కుమార్తె రేణుక (19) జనగామ జిల్లా మండల శివారు నర్సింగాపూర్ కు చెందిన అమిరిశెట్టి పరమేశ్వరి సత్తయ్య దంపతుల కుమారుడు రాకేష్ హైదరాబాదులో క్యాటరింగ్ పని చేస్తుండగా సోషల్ మీడియా



ద్వారా రేణుక రాకేష్ కు పరిచయం ఏర్పడింది. పెద్దల అంగీకారంతో 2023 జూన్లో వీరు వివాహం చేసుకున్నారు. కొంతకాలం వీరి సంసారం సాఫీగా సాగింది. రాకేష్ ఇంటి వద్ద పనిచేయకుండా మద్యం తాగుతూ కుటుంబ పోషణ మరిచాడు. పని ఎందుకు చేయడం లేదని భార్య రాకేష్ ని నిలదీయడంతో గొడవ జరిగింది. పెళ్లి సమయంలో నువ్వు కట్నం తీసుకురాలేదని కట్నం తీస్తే నేను పని చేస్తానని వేధింపులకు గురి చేశాడు. మనస్థాపం చెందిన రేణుక అక్టోబర్ 30న గడ్డి మందు సేవించింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు జనగామ, వరంగల్ తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. రేణుక చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. వరకట్నపు వేధింపుల కింద అమ్మిరిశెట్టి రాకేష్, అత్త పరమేశ్వరి పై కేసు నమోదు చేయడం జరిగింది. మృతురాలి తల్లి అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పేదల బతుకుల్లో మార్పు కోసం కాంగ్రెస్‌కు ఓటేయండి

### అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**గొల్లపల్లి( ప్రజామంటలు) నవంబర్ 08 :** పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు నిరుపేదల బతుకుల్లో మార్పు లేదని మార్పు కోసం చేతి గుర్తుకు ఓటేయాలని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు .గొల్లపల్లి మండలం శంకర్రావుపేట్, మల్లన్నపేట, వెంగలాపూర్ ,నందిపల్లె , రాఘవపట్నం ,గుంజపడుగు,అగ్గిమల్ల గ్రామాల్లో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పార్టీ ప్రజాప్రతినిధులు ,నాయకులు ,కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయనకు మహిళలు బతుకమ్మ ఆటపాటలతో ఘన స్వాగతం పలికి వీర తిలకం దిద్దారు .ఆయా గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.మల్లన్న పేట గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం ఆయా గ్రామాల్లో గడపగడపకు తిరిగుతు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం కల్పించాలంటూ ఓటర్ల కు ఓటు అభ్యర్థించారు .ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలనూ ఉద్దేశించి మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నింటిని విస్మరించారని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీళ్లు లేవు, నిధులు లేవు ఉద్యోగాలు అసలే లేవని ఎద్దేవా చేశారు .కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట లక్ష కోట్లు దోచారని దళారీ వ్యవస్థను ప్రోత్సహించడంలో ప్రభుత్వంలో కింది నుంచి పెద్దల వరకు పోటీ పడుతున్నారని ఆరోపించారు. బస్తాకు ఐదు నుంచి 8 కిలోల వరకు దోచుకొని రైతులను నిలువదోపిడి చేస్తున్న పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు .దళితులకు మూడు ఎకరాల భూమి అన్నారు డబుల్ బెడ్ రూమ్ అన్నారు ఎక్కడైనా కనిపిస్తున్నాయా అంటూ ప్రజలను ప్రశ్నించారు. మరోసారి బిఆర్ఎస్ కు అవకాశం ఇస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు .ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వివిధ పార్టీల నుంచి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర రావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నిశాంత్ రెడ్డి ,యూత్ అధ్యక్షులు ఓరగంటి తిరుపతి ,సర్పంచులు గంగాధర్, సత్యనారాయణ రాజ్యలక్ష్మి తిరుపతిరెడ్డి ,పద్మవెంకటేశం ,ఉప సర్పంచులు భేర కిషోర్ ,శ్రీధర్ ,వెంకటేష్ హరికిరణ్ ,ఎంపిటిసి దనవ్వలక్ష్మణ్ ,నాయకులు సురేందర్, సంతోష్, రమేష్ ,రాంమోహన్ రెడ్డి, రాజిరెడ్డి ,రమేష్ రెడ్డి, రాజేశ్వర్, మహేష్ ,దిలీప్ విక్రమ్ ,వినోద్,హనుమండ్లు సట్ట ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# ఐసీసీ ర్యాంకుల్లో టాప్‌లోకి దూసుకొచ్చిన గిల్




ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా క్రికెటర్లు అదరగొట్టారు. సుమారు 950 రోజుల పాటు వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజామ్‌కు టీమిండియా ప్రిన్స్ శుభ మన్ గిల్ చెక్ పెట్టాడు. మొత్తం 830 రేటింగ్ పాయింట్లతో గిల్ ప్రపంచ నంబర్ 1 వన్డే బ్యాటర్‌గా నిలిచాడు. బాబర్ ఆజం 824 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. క్వింటన్ డి కాక్ మూడో స్థానంలో, విరాట్ కోహ్లీ నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. శుభ్ మన్ గిల్ గత రెండేళ్లుగా దూకుడుగా బ్యాటింగ్ చేస్తూ భారీగా పరుగులు చేస్తున్నాడు. గిల్ 6 సెంచరీలు, 11 హాఫ్ సెంచరీలు సాధించాడు. ఇక 2023లో గిల్ 26 మ్యాచ్‌లు ఆడి 63 సగటుతో 1449 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు, 7 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఇందులో న్యూజిలాండ్‌పై 208 పరుగుల తుఫాన్ ఇన్నింగ్స్ కూడా ఉంది. కాగా వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలదొక్కుకోవాలంటే ప్రపంచకప్‌లోని మిగిలిన మ్యాచ్‌లలో అతను మరింత మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. లేకపోతే బాబర్ ఆజం మళ్లీ నంబర్ వన్ అవుతాడు ఎందుకంటే అతనికి, గిల్‌కు రేటింగ్ పాయింట్‌ల మధ్య పెద్దగా వ్యత్యాసమేమీ లేదు.ఇక హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ వన్డే బౌలర్ల ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. తాజాగా విడుదలైన ర్యాంకింగ్స్‌లో మహ్మద్ సిరాజ్ 709 రేటింగ్ పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచాడు. అతని తర్వాత 694 రేటింగ్ పాయింట్లతో దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్ రెండో స్థానంలో ఉన్నాడు. అంటే ప్రస్తుతం 700కి మించి రేటింగ్ పాయింట్లు సాధించిన టీమిండియా బౌలర్ సిరాజ్ ఒక్కడే కావడం విశేషం. కాగా మొన్నటి వరకు అగ్రస్థానంలో ఉన్న పాకిస్థాన్ స్పీడ్ స్టర్ షాహీన్ షా అఫ్రిది ఇప్పుడు ఏకంగా 5వ స్థానానికి పడిపోయాడు. ఇక లేటెస్ట్ వన్డే ర్యాంకింగ్స్‌లో 662 రేటింగ్ పాయింట్లతో జంపా మూడో స్థానంలో ఉండగా, 661 రేటింగ్ పాయింట్లతో టీమిండియా స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ నాలుగో ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. వీరితో పాటు, జస్ప్రీత్ బుమ్రా 654 రేటింగ్ పాయింట్లతో 8వ స్థానంలో, మహ్మద్ షమీ 635 పాయింట్లతో 10వ స్థానంలో ఉన్నాడు.

# అల్లు అర్జున్‌ను నేను అలా అనలేదు : అనసూయ



యాంకర్ అనసూయ కేరీర్ ఆరంభం నుంచి వార్తల్లో నిలుస్తూనే ఉన్నది. ఆమె ఎక్కడ మాట్లాడినా ఎక్కడో ఏదో విషయంలో అడ్డంగా బుక్ అవుతూ ఉంటుంది. తాజాగా ఇటీవల ఆమె ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూతో మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. టీవీ నుంచి సిల్వర్‌స్క్రీన్‌కు అప్‌గ్రేడ్ అయిన అనసూయ అనతి కాలంలోనే వినూత్న పాత్రలు పోషిస్తూ బిజీ అవుతూ వస్తున్నది. ముఖ్యంగా సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'రంగస్థలం, పుష్ప' సినిమాలతో జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ క్రమంలో తమిళంలోనూ కొన్ని సినిమాల్లోను నటించింది. ఇదిలాఉండగా ఈ మధ్య సినిమాలతో కాకుండా తన సోషల్‌మీడియా పోస్టులు, సెటైర్లతో ట్రెండింగ్‌లో ఉంటూ వస్తుంది. ఈ క్రమంలో ఆమె ఈ మధ్య ఓ యూట్యూబ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుష్ప సినిమా గురించి మాట్లాడుతున్న సందర్భంలో 'అల్లు అర్జున్ సామాజిక మాధ్యమాల్లో తన డ్యాన్స్ గురించి ఫ్యాన్స్ ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను తీసుకుని తన అప్‌కమింగ్ సినిమాలలో సరి చేసుకుంటాడని, అదేక్రమంలో పుష్ప సినిమాలో కొన్ని మిస్టేక్స్ చేశాడని ఇప్పుడు 'పుష్ప2'లో అలా జరగకుండా చూసుకుంటున్నాడని' ఆమె చెప్పినట్లుగా వార్తలు వైరల్ అయ్యాయి.

# అతడి మరణం తట్టుకోలేకపోయా : యాంకర్, నటి ఝాన్సీ

ప్రముఖ యాంకర్, నటి ఝాన్సీ అందరికీ పరిచయస్తురాలు. ఆమె టీవీ వ్యాఖ్యాతగా, చాలా తెలుగు చిత్రాల్లో నటించి తన ప్రతిభ చాటుకున్నారు. అలాగే సామజిక సమస్యల మీద కూడా తనదైన రీతిలో స్పందిస్తూ వుంటారు. ముఖ్యంగా ఆడవాళ్ళ మీద జరిగే ఎటువంటి దాడి అయినా ఆమె ఖండిస్తూ వుంటారు. అటువంటి ఝాన్సీ ఇప్పుడు చాలా ఆవేదనకు గురయ్యారు. తన తమ్ముడు లాంటి శ్రీను, తన వ్యక్తిగత కార్యదర్శి కూడా అయిన అతను ఈరోజు గుండెపోటు వచ్చి మరణించాడు. అందుకు ఝాన్సీ ఎంతో ఆవేదనతో అతని గురించి తన సాంఘీక మాధ్యమం అయిన ఇన్స్టాగ్రామ్ లో ఒక పోస్ట్ పెట్టారు."శ్రీను, శ్రీనుబాబు అని నేను ముద్దుగా పిలుచుకునే నా ప్రధాన సపోర్ట్ సిస్టమ్. హెయిర్ స్టైలిస్ట్‌గా అతను నా దగ్గర చిన్నగా ప్రారంభించి, తరువాత నా వ్యక్తిగత కార్యదర్శిగా ఎదిగాడు. అంతే కాకుండా నా పనులన్నీ చూసుకోవటమే కాకుండా, చాలా సమర్థవంతంగా నిర్వహించేవాడు.

# వాళ్లకు అసలు బుర్ర పనిచేస్తోందా? : హీరోయిన మృణాల్ ఠాకూర్



నేషనల్ క్రష్ రష్మిక మందన్నా మార్ఫింగ్ వీడియోపై ఒరిజినల్ వీడియోలో ఉన్న జరా పటేల్ స్పందించారు. జరిగిన దానికి చింతిస్తునట్లు చెప్పారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె ఓ పోస్ట్ చేశారు. జరా పటేల్ బ్రిటిష్ ఇండియన్ ఇన్ స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్. రష్మిక ఇష్యూ గురించి ఆమె ఏమన్నారంటే.. "డీప్ ఫేక్ వీడియో టెక్నాలజీతో నా శరీరానికి ప్రముఖ నటి ముఖాన్ని జోడించగా వైరల్ అయిన వీడియో నా దృష్టికి వచ్చింది. ఈ విషయంలో నేను చాలా చింతిస్తున్నా. ఇందులో నా ప్రమేయం ఏ మాత్రమూ లేదు. ఈ పరిస్థితి చూస్తుంటే మహిళలు, చిన్నారుల భవిష్యత్ ఏమవుతుందోనని ఆందోళనగా ఉంది. సోషల్ మీడియా వేదికగా ఏది పంచుకోవాలన్నా భయంగా ఉంది. దయచేసి ఇలాంటి వాటిని ఎంకరేజ్ చేయవద్దు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి దాని విషయంలో నిజ నిర్ధారణ ఎంతో అవసరం. మనం ఇంటర్‌నెట్‌లో చూసేది ఏదీ నిజం కాదు" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో జరా పటేల్ పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఆమె చేసిన పోస్ట్ కూడా వైరల్ అవుతోంది.ఇదే ఘటనపై హీరోయిన మృణాల్ ఠాకూర్ కూడా స్పందించారు. 'ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వాళ్లను చూస్తుంటే సిగ్గుగా ఉంది. వాళ్లకు అసలు బుర్ర పనిచేస్తోందా? ఈ ఘటనను ప్రతిఘటిస్తూ గొంతెత్తిన రష్మికకు కృతజ్ఞతలు. మాట్లాడకుండా మౌనంగా ఉంటే ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. చాలా మంది మౌనంగా ఉండిపోతారు. రోజూ ఇంటర్నెట్‌లో కొన్ని వందల మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా హీరోయినలకు సంబంధించి వారి శరీర భాగాలను జూమ్ చేసి మరీ వీడియోలు తయారు చేస్తున్నారు. అసలీ సమాజం ఎటు పోతుంది? మేమంతా వృత్తిరీత్యా నటులమే కావచ్చు కానీ, మేము కూడా మనుషులమే కదా! మౌనంగా ఉండటానికి ఇది సమయం కాదు" అని మృణాల్ ఆగ్రహించింది. అయితే ఈ చర్యను ఖండిస్తూ ఇప్పటికే కేంద్ర ఐటీశాఖ నుంచి అమితాబ్, నాగచైతన్య, చిన్మయి వరకూ రష్మికకు మద్దతుగా నిలిచారు. నిందితులను శిక్షించాలని కోరారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com